క్లుప్తంగా

బాలల హక్కులను కాపాడాలి

లింగాల: బాలల హక్కులను కాపాడేందుకు అందరు బాధ్యతగా వహించాలని సర్పంచ్ బండి ఎల్లయ్య కోరారు. సోమవారం మండలంలోని అవుసలికుంట పంచాయతీ ఆవరణలో ఎస్వీకే ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలలను చదువుల్లో ప్రోత్సహించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, బాల కార్మిక నిర్మూలనకు కృషి చేయాలని సర్పంచు కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కోడేరు: మండలంలోని జనుంపల్లికి చెందిన గౌసియాబేగం భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. బాధిత కుటుంబానికి 2017 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఖాదర్, రవి, ఖలీల్, రాజు, శివమ్మ, రాధ, రమేష్, లక్ష్మణ్, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో అల్లు కృష్ణారెడ్డి చేరిక



కొల్లాపూర్: మండలంలోని ఎల్లూరు చెందిన అల్లు కృష్ణారెడ్డి సోమవారం వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో పార్టీలో చేరారు. టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న ఆయన వైఎస్సార్‌టీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. షర్మిల ఆధ్వర్యంలోనే రాజన్న పాలన సాధ్యమవుతుందన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తాండ్ర గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పాదయాత్ర నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమలో సుదర్శన్, ముత్యాలు, వెంకటయ్య, అల్లాజీ, హరీష్‌యాదవ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


నేడు బాలల కమిషన్ సభ్యురాలి పర్యటన

మన్ననూర్: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అపర్ణ ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో మంగళవారం పర్యటించనున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సువర్ణ తెలిపారు. మండలంలోని రాయలగండి, అమ్రాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు.

పింఛన్ లబ్ధిదారుల ఆందోళన

నాగర్‌కర్నూల్ రూరల్: పింఛన్ డబ్బులు ఇవ్వాలని లబ్ధిదారులు సోమవారం మండలంలోని తూడుకుర్తిలో ఆందోళనకు దిగారు. గ్రామంలో 1,063 మంది లబ్ధిదారులు ఉండగా 200 మందికి మాత్రమే పోస్టుమన్ పింఛన్లు ఇచ్చాడని అన్నారు. మరో రెండు రోజుల్లో అందరికీ డబ్బులు అందజేస్తామని పోస్టుమన్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రతి ఇంటిలో భగవద్గీత ఉండాలి



బిజినేపల్లి: ప్రతి ఇంటిలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం ఉండాలని ఇందూ జ్ఞాన వేదిక కమిటీ తెలిపింది. సోమవారం మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో గ్రంథపై ప్రచారం, అవగాహన కల్పించారు. భగవద్గీత ద్వారా కర్మ విధానం తెలుసుకుని యోగం ఆచరించి మోక్షం పొంది జనన, మరణ చక్ర నుంచి బయట పడాలని సూచించారు. కార్యక్రమంలో మనోహర్, నిరంజన్, చంద్రకళ, తిరుపతి, మంజుల, సుధాకర్, శిరీష, చరణ్, సిద్దార్థ, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

అడవిలో ఎండుగడ్డి తొలగింపు



నీటితొట్ల ఏర్పాటుకు పరిశీలిస్తున్న అధికారులు



ఎండు గడ్డిని తొలగిస్తున్న కూలీలు

లింగాల: మండలంలో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతం వేసవిలో అగ్ని ప్రమాదాలకు గురికాకుండా అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ప్రతి ఏటా వేసవిలో మంటలు చెలరేగి వందలాది ఎకరాల్లో తీవ్ర నష్టం సంభవించేది. వన్య మృగాలు తరలిపోవడం, విలువైన వృక్ష సంపద కాలి బూడిద అవుతుంటాయి.

కూలీలతో ఎండుగడ్డి తొలగింపు

అటవీ ప్రాంతానికి వెళ్లే రహదారులకు ఇరు వైపుల ఉన్న ఎండు గడ్డిని తొలగించే పనులను చేపట్టారు. రహదారుల వెంట వెళ్లే వారు రాజేసే అగ్గి పుల్ల అటవీకి వ్యాపించకుండా నిరోధించేందుకు ఎండు గడ్డిని కొంత దూరం తొలగిస్తున్నారు. ఇందుకు స్థానిక కూలీలనే గాక ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను ఉపయోగిస్తున్నారు. మంటలు వ్యాపించే ప్రాంతాలను గుర్తించి అందుబాటులో నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. అకస్మాత్తుగా అగ్గి రాజుకుంటే ఆర్పేందుకు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతున్నారు.

ప్రజలకు అవగాహన

అటవీ ప్రాంతంలో ఉండే చెంచులకు, ఇతర గ్రామాల ప్రజలకు అటవీ శాఖ వారు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. అడవుల రక్షణ అందరి బాధ్యతగా గుర్తించేలా ప్రజలకు తెలిపరుస్తున్నారు. ఇప్పటికే ఎర్రపెంట, పద్మన్నపల్లిలో సదస్సులు నిర్వహించి అడవులకు నిప్పు పెడితే కలిగే నష్టాన్ని వివరించినట్లు బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాష తెలిపారు. కలప, ఇతర అటవీ సంపద కోసం అడవిలో నిప్పు పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీట్ ఆఫీసర్ తెలిపారు.

ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపాలి



రాకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు



కల్వకోల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

తెలకపల్లి: ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాకొండ కస్తూర్బా పాఠశాల, గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో నాయకులు ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై వాణిని వినిపించే నాయకుడిని మాత్రమే శాసనమండలికి పంపాలన్నారు. ఎన్నికల బరిలో ఉన్న భుజంగరావుకు ఓటు వేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి సంఘం అండగా ఉంటుందన్నారు. మేధావులు ఆలోచించి తమ ఓటును వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సుదర్శన్, మురళీ, విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీను, ప్రభాకర్, శంకర్, జహంగీర్ పాష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మాణిక్యరెడ్డిని గెలిపించాలి

పెద్దకొత్తపల్లి: టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్యరెడ్డిని గెలిపించాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యలను పరిష్కారం కోసం మాణిక్యరెడ్డి ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సమస్యలను పరిష్కరించే వారికి ఓటు వేసి గెలింపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్‌శర్మ, చంద్రశేఖర్, ఆంజనేయులు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు సిద్ధం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. 30ఏళ్ల నుంచి ఆలయ అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 15వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

16న కల్యాణం

దేవాలయంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్స వాలు కొనసాగుతాయి. 15వ తేదీన బుధవారం వేకువజామున సుప్రభాత సేవలతో ప్రారంభం అవుతాయి. రాత్రి 7 గంటలకు ఎదురుకోళ కార్యక్రమం, 16వ తేదీ కల్యాణోత్సవంకు ఏర్పాట్లు చేశా రు. 17న ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18వ తేది మహాశివరాత్రి వేడుకలతో పాటు ప్రత్యేక పూజలు ఆలయంలో చేపడుతున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఆయన చైర్మన్ మనోహర్ తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు బల్మూర్ మండలం మహదేవ్‌పూర్ చెందిన సైదులు రూ.15వేల విలువగల కలర్ ప్రింటర్‌ను వితరణ చేశారు. విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రింటర్‌ను అందజేసినట్లు తెలిపారు.

వేడుకలు విజయవంతం చేయండి

ఉప్పునుంతల: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు 15వ తేదీన అచ్చంపేటలో నిర్వహిస్తున్నట్లు గిరిజన సేవా సమితి నాయకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని గిరిజనులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ పంచాయతీ పరిధిలోని వడ్డేర కాలనీకి చెందిన బోదాస్ వెంకటయ్య(62) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 10వ తేదీన వెంకటయ్య కూలీ పని కోసం పెద్దాపూర్‌కు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటయ్యకు తీవ్ర గాయాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అల్లుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

అచ్చంపేట: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో మహిళల పాత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ మాట్లాడుతూ దేశ మహిళలు, బాలికలు జాతీయ స్థాయిలో గొప్పగా రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంధ్యారాణి, సుజాత, గణేష్, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

లింగాల: మండలంలోని అప్పాయపల్లికి చెందిన రైతు పుట్ట నిరంజన్ ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి చేయూత అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ నీలవేణి, ఎంపీటీసీ కాశీనాథం, పర్వతాలు ఉన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలో ఈనెల 11న విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన రైతు మొల్గర చిన్న తిరుపతయ్య కుటుంబసభ్యులను సోమవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అంతకు ముందు డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ పరామర్శించారు. వారి వెంట సర్పంచ్ శివశంకర్, ఎంపీటీసీ కరీమాబేగం, ఖదీర్ ఉన్నారు.

‘ప్రజావాణి’కి అధికారుల గైర్హాజరు



పెంట్లవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో హాజరైన ఇద్దరు అధికారులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరు కావాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి వారం అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఒకటి, రెండు శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. అధివిదంగా సోమవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో 11.10 గంటలు దాటినా ఇద్దరు అధికారులు మినహా ఎవరూ రాలేదు. ఏమైన సమస్యలు ఉంటే ఎవరికి చెప్పుకోవాలని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

ప్రజావాణిని వినియోగించుకోండి

వెల్దండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్, ఏఈ తిరుపతినాయక్, శ్రీమతి, నరేష్‌రెడ్డి, బాలయ్య తదితరులు ఉన్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కార్మికులు

తెలకపల్లి: పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కార్మికులు భిక్షాటన చేశారు. జిల్లా కార్యదర్శి సైదులు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ, మాస్కులు, ఐడీ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత కార్మికులకు దళితబంధు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకుర్తి నుంచి పట్నం వరకు 17 రోజుల పాటు చేస్తున్నటువంటి పాదయాత్రకు మద్దతు ఇస్తున్నామన్నారు. జిల్లాలో ఈ నెల 15వ తేదీ నాడు కార్మిక సమస్యలు పరిష్కరించాలని కొల్లాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. 19, 20 తేదీలలో పాలకుర్తి నుండి పట్నం వస్తున్న పాదయాత్రలో నాగర్‌కర్నూల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో పాదయాత్ర ముగింపు 28న ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మయ్య, పార్వతమ్మ, రాజు, రాములు, శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటి వెలుగు’



తాడూరులో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఇస్మాయిల్

తాడూరు: మండల కేంద్రంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుమ్మెరలో కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో 18 రోజులుగా 3,400 మందికి పరీక్షలు చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న శిబిరానికి మేడిపూర్‌కు మారుస్తున్నట్లు తెలిపారు.

కోడేరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దశరథం, ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు బావాయిపల్లిలో 323 మందికి కంటి పరీక్షలు చేయగా 16మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పది మందిని వైద్య పరీక్షల కోసం రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగమ్మ, మల్లేష్, దేవిరాణి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడు బృందాలు కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 665 మందికి పరీక్షలు చేయగా 57 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లిలో సోమవారం ఎంపీడీఓ రామ్మోహన్ జాతీయ ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. అనంతరం వన నర్సరీ పనులు చూశారు. హరితహారం వరకు మొక్కలను సిద్ధం చేయాలని కార్యదర్శి సంధ్య, టీఏ ఆంజనేయులుకు సూచించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురంలో కొత్తగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు, వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఎన్నికల ముందు దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీహెచ్‌పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు. దళితులపై దాడులు చేయకుండా చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయాలని, దళితులపై నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దళితబంధు పథకం ప్రతి పేద కుటుంబానికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడెకరాల భూ పంపిణీ చేపట్టాలని కోరారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించడానికి ప్రోత్సాహక ధనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో బండి లక్ష్మీపతి, సురేష్, శివశంకర్, వెంకటయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ 2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని, సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి, నేటికి అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రానున్న కాలంలో ప్రజలు బీఎస్పీకి పట్టం కడితే రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. 9 ఏళ్ల పాలనలో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి ప్రగతి భవన్, పార్టీ కార్యాలయాలు, సచివాలయాలు కట్టించి ఇస్తున్న కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రెండు నెలల్లో నియోజకవర్గంలో ఇళ్లు ఇవ్వకపోతే బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాలను ప్రజలకు పంచిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యోసోఫ్, నాగన్న, రాంచందర్, వెంకటేష్, శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

ప్రజల సొమ్ము అదాని చేతుల్లో..



కొల్లాపూర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కొల్లాపూర్: గౌతమ్ అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సమితి సభ్యుడు ఫయాజ్ మాట్లాడుతూ అదానీ షేర్ల విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. మోదీ ప్రధాని కాకముందు ప్రపంచ కుబేరుల్లో 600 స్థానంలో అదానీ ఉన్నారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ప్రపంచ కుబేరుల స్థానాల్లో రెండో స్థానానికి చేరుకున్నారన్నారు. దేశ ప్రజల సొమ్మంతా అదానీ చేతుల్లో పెట్టడం కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. లాభాల్లో ఉన్న ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ సంస్థల ఆస్తులను అదానీ సంస్థల్లో కేంద్రం పెట్టుబడులు పెట్టించిందన్నారు. అదానీ మార్కెట్ షేర్లు కుప్పకూలిపోవడంతో ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ సంస్థలు కూడా భారీగా నష్టాల్లో కూరుకున్నాయన్నారు. దీనికి కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ, యూసుఫ్, వెంకటస్వామి, ఖాజామైనోద్దీన్, తుమ్మల శివుడు, ఎల్లయ్య పాల్గొన్నారు.

తెలకపల్లి: ప్రజల సొమ్ముతో చెలగాటం ఆడిన గౌతమ్ అదానిని తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూర్యశంకర్‌గౌడ్, మండల కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 2014లో ఎన్నికల సమయంలో నీతివంతమైన పాలన అని అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ తన పాలన కాలం అనంతరం 609 స్థానంలో ఉన్న గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరులలో 2వ స్థానంలో చేర్చిన ఘనత ప్రధానికే దక్కిందన్నారు. అమెరికాకు చెందిన హిడెన్‌బర్గ్ సంస్థ అదాని సంస్థలో చేసిన అబద్ధపు ప్రచారాలు, ఆర్థిక మోసాలు బయట పెట్టడం ద్వారా ప్రపంచం మొత్తం నివ్వెర పోయిందన్నారు. దేశ ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందన్నారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, రవీందర్, అంజి, సీతయ్య, బుగ్గస్వామి, లక్ష్మయ్య, చెన్నయ్య, పెంటయ్య, వేణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

వెల్దండ: గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీ రాములుకు సోమవారం మండల సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెర్కూర్, కేస్లీ తండా, కంటోనిపల్లిలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనలను నిర్మించాలన్నారు. ఇందుకు ఎంపీ సానుకులంగా స్పందించి నిధులను మంజూరు చేస్తామని హమీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలకు కావాల్సిన పనుల వివరాలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీకి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, రాజశేఖర్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

కల్వకుర్తి: మండలంలోని పంజుగుల చెందిన గణేష్‌కు మంజూరైన రూ.23,500 సీఎం సహాయనిధి చెక్కును సోమవారం ఎంపీ రాములు బాధితుడికి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి సామాన్య, పేద మధ్యతరగతి ప్రజలకు వరం లాంటిదన్నారు.

యాత్రికులకు అల్పాహారం పంపిణీ



అచ్చంపేటలో పండ్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



పెంట్లవెల్లిలో..

అచ్చంపేట: కాలినడకన శ్రీశైలం వెళ్తున్న భక్తుల కోసం పట్టణంలోని వై జంక్షన్ వద్ద కౌన్సిలర్ నిర్మల ఏర్పాటు చేసిన అల్పహార కేంద్రాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సోమవారం ప్రారంభించారు. శివసేవా సమితి ఆధ్వర్యంలో 16ఏళ్లుగా కాలినడక భక్తులు అన్నదానం, అల్పాహారం, తాగునీరు అందిచడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు మనోహర్, తులసీరాం, కౌన్సిలర్ సోమ్లానాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో కాలినడకగా శ్రీశైలం వెళ్లే భక్తులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహనాయుడుహాధ్వర్యంలో పండ్లు, నీరు, అన్నదానం శివరాత్రి వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం రోజు పంపిణీ చేశారు.

నిరంతర విద్యుత్ కోసం రాస్తారోకో

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం విద్యుత్ సరఫరాను నిరంతరం చేయకపోవడంతో పాటు కోతలు విధించడంపై బీజేపీ నాయకులు మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మండలాధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ఓ వైపు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని చెబుతూ 9 గంటలు కూడా సరఫరా చేయకుండా కోతలు విధించడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆయన అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ రాము కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ధనుర్మాస పూజల ఆడిట్ పూర్తి

కొల్లాపూర్: పట్టణంలోని రామమందిరంలో సంక్రాంత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ధనుర్మాస పూజల ఖర్చుల ఆడిట్‌ను సోమవారం నిర్వహించారు. భక్తులు అందించిన విరాళాలు, మిగులు నిధులతో కలిపి మొత్తం ఆదాయం రూ.8,46,318 ప్రకటించారు. ధనుర్మాస పూజలు, దేవతా మూర్తుల కల్యాణోత్సవాలకు రూ.5,47,726 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. మిగులు రూ.2,98,592 ఉన్నట్లు తెలిపారు. ఆడిట్‌లో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణయ్య, నిరంజన్‌రెడ్డి, నారాయణ, సీతారాముడు తదితరులున్నారు.